నాకు నచ్చిన నా కథ

నేను దాదాపు ముప్పై మూడు సంవత్సరాల నుంచీ కథలు వ్రాస్తున్నాను. ఇప్పటికి 600లకు పైగా కథలు వ్రాశాను. వీటిల్లో నాకు నచ్చిన కథలు ఎన్నో వున్నాయి. అన్నింటికంటె ఈ కథ బాగా నచ్చకపోయినా, అందుబాటులోవున్న నచ్చిన కథల్లో ఈ కథ నాకు బాగా నచ్చింది. ఈ కథ వ్రాసి దాదాపు 15 సంవత్సరాలై వుంటుంది. ఈ కథను ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికకు పంపినప్పుడు మిత్రుడు శ్రీ పురాణం సుబ్రహ్మణ్య శర్మగారు మరీ మరీ మెచ్చుకుంటూ ప్రత్యేకంగా ఉత్తరం రాశారు. అప్పుడనిపించింది- ఇది మంచి కథని. తర్వాత చాలమంది పాఠకులు, రచయితలు ఈ కథపై సదభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఈ కథ నాకూ, మరి చాలమందికీ ఎందుకు నచ్చిందో – మీరూ చదివితే మీకూ బోధపడగలదు.

రమారమి మూడున్నర దశాబ్దాల నుంచీ ఇటు తెలుగులోనూ, అటు ఇంగ్లీషులోనూ దేశ దేశాల కథలు చదువుతున్నాను. గురజాడ అప్పారావుగారి 'దిద్దుబాటు' కథ నుంచీ 1980 చక్రపాణి అవార్డు పొందిన 'సబ్బు' కథ దాకా; మపాసా కథల నుంచి 1980లో 'టైమ్' మ్యాగజీన్ ఉత్తమంగా ఎంపికచేసిన యుడోరా వెల్టీ కథల వరకూ కొన్ని వేల కథలు చదివాను. ప్రపంచ కథాసాహిత్యంలో ఎన్నో మార్పులూ, ధోరణులూ వస్తున్నాయి. అయితే గత ఏడెనిమిది సంవత్సరాలనుంచీ తెలుగు కథ అభివృద్ధిలో స్తబ్ధత గోచరిస్తోంది. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర్నుంచీ దాదాపు పాతికేళ్ల వరకూ తెలుగులో ఎన్నో మంచి కథలు వచ్చాయి. ఈ మధ్య కాలంలో అంతగా మంచి కథలు రావడం లేదు. కథల రాశి పెరుగుతూంది గానీ, నాణ్యత తగ్గిపోతోంది. వస్తువులో వైవిధ్యం, శిల్పంలో నవ్యత్వం, కథలో ప్రయోజనం – వీటి పట్ల కథలు వ్రాసేవారు శ్రద్ధ కనబర్చాల్సిన అవశ్యకత ఎంతైనా వుంది.

—తాళ్లూరు నాగేశ్వరరావు

ప్రేమికుని ఆంతరంగిక ప్రపంచం

సాయంత్రపు సూర్యుడు మబ్బుల్ని ఎర్రగా వెలిగించి, ఆ కాంతి లోకంపై అందంగా పడుతూండగా, నిష్క్రమించటానికి ఆజీలుగా ఉన్నాడు.

ఆ సమయంలో హైదరాబాద్ ఆబిడ్ సర్కిల్ బస్సుస్టాప్ దగ్గర చిన్ననాటి మిత్రులు కాంతారావూ, ముత్యాలరావూ హఠాత్తుగా, ఆశ్చర్యంగా కలుసుకున్నారు. బందరులో కాలేజీ చదువు ముగించాక ఆ ఏడెనిమిది సంవత్సరాలలో వాళ్లెప్పుడూ ఒకళ్ళ కొకళ్ళు తటస్థపడలేదు. సభ్యతా నాగరికతలను మరిచి ఇరువురూ అమాంతంగా కౌగలించుకున్నంత ఆత్మీయతను చూపులద్వారా, మాటలద్వారా వెల్లడించుకున్నారు.

"ఏం చేస్తున్నావు ఇక్కడ ?" అన్నాడు కాంతారావు.

"ఎ. జి. ఆఫీసులో యు. డి. సి. – మరి నువ్వో ?" అన్నాడు ముత్యాలరావు.

"నేను ఎల్. ఐ. సి. లో అసిస్టెంటును" అన్నాడు కాంతారావు.

ఇద్దరూ దగ్గరలో ఉన్న ఓ పెద్ద హోటలుకు వెళ్ళారు. కాఫీ త్రాగుతూ ఓ పావుగంటసేపు కులాసాగా, పాత జ్ఞాపకాల్ని వల్లించుకుంటూ కబుర్లు చెప్పుకున్నారు. పొగబారిన తమ పూర్వ స్నేహానుబంధాన్ని చక్కగా తుడిచి అద్దం వలె పెట్టుకున్నారు.

"పిల్లలెంతమంది?" అన్నాడు కాంతారావు అతనికి పెళ్ళి అయివుంటుందనే ఉద్దేశంతో.

"ఒక అమ్మాయి. మరి నీకూ ?" అన్నాడు ముత్యాలరావు.

"ఇద్దరు, ఒక అమ్మాయి, ఒక అబ్బాయి." అన్నాడు కాంతారావు.

కాఫీ బిల్లు యివ్వడానికి ముత్యాలరావే ముందంజ వేశాడు. కౌంటరు దగ్గర ప్యాంటు జేబులోంచి పర్సు తీసి, రూపాయి నోటు లాగుతూంటే, ఆ పర్సు

లోంచి ఓ చిన్న ఫొటో క్రిందబడింది. కాంతారావు గబుక్కున క్రిందకు వంగి ఆ ఫోటోను తీసుకొన్నాడు. ఆ ఫొటో ఒక యువతిది. లోకోత్తరమైన రూపు రేఖా విలాసాలతో ఆ యువతి అప్సరసవలె ఉంది. ఆ మరుక్షణంలోనే ఆమె ఆ నవ్య సౌందర్య విశేషం అతని హృదయఫలకంపై బొమ్మ కట్టింది. ఆ ఫొటోను మిత్రునకిస్తూ, "ఎవరిదీ ఫొటో. మీ శ్రీమతిదా?" అన్నాడు కాంతారావు.

"ఊఁ" అన్నాడు ముత్యాలరావు.

"నువ్వు భలే అదృష్టవంతుడువోయ్! అందమైన భార్యను పొందా. నీవే బ్రతుకులో సుఖాలు తేనె వూరలే!" అన్నాడు కాంతారావు హోటల్నుంచి బయటకు వస్తూ.

"మీ ఆవిడ అందంగా వుండదా" అన్నాడు ముత్యాలరావు అమాయకంగా.

"మా ఆవిడ సంగతి చెప్పు – పాత చింతపండు తొక్కా. పూర్వజన్మలో చేసుకున్న పాపానికి ఈ జన్మలో శాపంగా నా జీవితంలో అడుగుపెట్టిన శూర్పణఖ!" అన్నాడు కాంతారావు.

ముత్యాలరావు మొహం ముసి ముసి నవ్వులతో ముద్దుకట్టింది.

ఆ మిత్రు లిద్దరూ బస్సుస్టాపులో బస్సులు వచ్చి ఆగగానే విడిపోయారు.

బ్రహ్మదేవుడు ఆగ్రహావేశంతో సృష్టించిన వికృతరూపం ముత్యాలరావుది. తుమ్మబెరుడులాంటి శరీరఛాయ; పైగా చెదలు తిన్నట్టు గుంటలుబడ్డ మసూచికపు మచ్చలు; నుదురు వెడల్పు: ముక్కు సంకర; మూతి పొడుగు; చెంపలు అప్పడాలు; కళ్ళు పాతాళ గంగలు; జుత్తు జొన్న కంకులు. కాలేజీలో బి. కామ్ చదువుతున్న రోజులలో క్లాసు పిల్లలంతా ఎగతాళి పట్టిస్తూండేవారు. 'ఈ నల కూబరునికి ఏ రంభ భార్యగా లభిస్తుందని.' అల్లాగే నిజంగానే రంభలాంటి స్త్రీయే భార్యగా లభించింది; వివాహాలు కూడా సృష్టి రహస్య లీలా విశేషాలే! 'తన లాంటి అందగాడికి కురూపిలాంటి భార్యా!' అనుకున్నాడు కాంతారావు సిటీ బస్సులో.

నెల రోజుల పిమ్మట ఓ రోజు సాయంకాలం కాకతాళీయంగా మిత్రులిద్దరూ పబ్లిక్ గార్డెన్‌లో పచ్చగడ్డిపై కలుసుకున్నారు. ముత్యాలరావు వెంట ఓ నాలుగేళ్ల అమ్మాయి ఉంది. పుత్తడి బొమ్మ. చక్కని రూపుగల్గి అందాన్నంతా పుణికిపుచ్చుకుని జన్మ ఎత్తిన పిల్ల. ఆ అమ్మాయి అందచందాలకు తన కూతురు రూపురేఖలకూ బేరీజు వేసుకుని న్యూనతాభావంతో క్రుంగిపోయాడు కాంతారావు. ఆ అమ్మాయిని దగ్గరకు తీసుకుని మనసారా ముద్దాడి, నవ్వించి,

నవ్వుకుని ఆనందించాడు. తర్వాత ఓ నెమిలిపిల్ల రాగా దానితో ఆడుకోవటానికి ఆ అమ్మాయి పరుగెత్తింది. "షీలా! జాగ్రత్త! దూరం పోకు! మారుపడిపో గలవు" అని హెచ్చరించాడు ముత్యాలరావు.

"నీ అమ్మాయి ఎంత ముద్దు వస్తుందోయ్! అచ్చు నీ ఆవిడ పోలికలే" అన్నాడు కాంతారావు.

చిన్నగా నవ్వుకున్నాడు ముత్యాలరావు. ఆ నవ్వులో గర్వం కిరణంలా పొడుచుకొచ్చింది.

"నువ్వు పిల్లల్ని ఇట్లా షికారుకు తీసుకురావా?" అన్నాడు ముత్యాలరావు.

"కారు చింతపండు సరుకు, వాళ్ళను తీసుకు వస్తే నా పరువు మర్యాదలు పారిపోవాల్సిందే!" అన్నాడు కాంతారావు.

ముత్యాలరావు ఒక్కసారిగా పెద్ద పెట్టున నవ్వాడు. కాంతారావు విస్మయంగా అతనికేసి చూశాడు.

నవ్వుతూ నవ్వుతూనే హఠాత్తుగా ఆ నవ్వును ఆపి, గుండెను చేత్తో పట్టుకుని బరువుగా అదుముకున్నాడు.

"ఏమిటోయ్!" అన్నాడు కాంతారావు అదుర్దాగా.

ముత్యాలరావు కొంచెం తమాయించుకుని, "కొంచెం గుండె నొప్పిగా ఉంది. తగ్గిందిలే, కాదు.... నీ మాటలకు నవ్వొచ్చి...." అన్నాడు.

దూరంగా ధాలియా పువ్వుల మీదనుంచి సూర్యుడు దిగిపోతున్నాడు. నారింజపండు రంగులాంటి సూర్యుని ఆఖరి మెత్తని కాంతికి పబ్లిక్ గార్డెన్‌లోని రంగు రంగుల పువ్వులు ఆనందోజ్జ్వలంగా వీడ్కోలు చెబుతున్నట్టున్నాయి.

"ఒకసారి మా యింటికి రావోయ్! నువ్వే చూద్దువుగాని - మా ఆవిడనూ, పిల్లలనూ," అన్నాడు కాంతారావు. తన అడ్రసు చెప్పాడు.

కాని ముత్యాలరావు తన అడ్రసు చెప్పి, మిత్రుణ్ణి తన ఇంటికి రమ్మనమని ఆప్యాయంగా ఆహ్వానించలేదు. కాంతారావు మనస్సు కలుక్కుమన్నది. స్త్రీ అందం నయాగరా జలపాతం, హిమాలయ సానువులు తాజ్‌మహల్ సౌందర్యాల వలె ప్రజలందరికీ సంబంధించినవి కాదు గదా! తన భార్య అందాన్ని ఎదుటి వాడు ప్రత్యక్షంగా మెచ్చుకోవడాన్ని ఏ భర్తా సహించలేడు. అందులో అంద విహీనుడికి అందమైన భార్య లభిస్తే అతని మానసిక ప్రపంచం వేరు. అది నర్మదా నది కంటె ఇరుకైనది. అందుచేతనే ముత్యాలరావు తనని తన ఇంటికి రమ్మనమని ఆహ్వానించలేదని కాంతారావు సులభంగా ఊహించాడు. అయి నప్పటికీ అతను ఉండబట్టలేక నోరు తెరిచి అడిగాడు.

"నువ్వెక్కడ వుంటున్నావ్ ? అడ్రసేమిటి ?"

గుటక గొంతులోకి జారని అయిష్టంతోనే తన అడ్రసు చెప్పాడు ముత్యాల రావు: "బర్కత్‌పురా, ఆంధ్ర యువతీమండలి ఎదురుగల్లీలో." ఆ అడ్రసును డైరీలో వ్రాసుకున్నాడు కాంతారావు.

కనిచీకటి ప్రవేశించడంతో, మిత్రు లిద్దరూ పబ్లిక్ గార్డెన్ నుంచి విడి పోయారు.

* * *

ఓ పక్షం రోజులు గడిచాక, ఆదివారంనాడు ముత్యాలరావు ఏదో పని వుండి శాంతినగర్ కాలనీకేసి వెళ్ళితే, అక్కడ హఠాత్తుగా కాంతారావు కనబడ్డాడు. మిత్రుణ్ణి తన ఇంటికి తీసికెళ్ళేవరకూ వూరుకోలేదు కాంతారావు.

ఒక డాబాలో చిన్న పోర్షన్ - దానికే తొంభై రూపాయిలు అద్దె చెల్లిస్తున్నా డట. తన భార్యనూ పిల్లల్నీ ఎదురుగా నిలబెట్టి మిత్రునికి పరిచయం చేశాడు కాంతారావు.

"మా ఆవిడ మీ ఆవిడలాగా అందగత్తె కాదు. మా పిల్లలు కూడా మీ అమ్మాయిలాగా ముద్దు వచ్చేవాళ్ళుకాదు" అన్నాడు కాంతారావు నిర్మోహమాటంగా.

"ఆఁ అందాన్ని కోసుకు కూర వండుకుంటామా ?" అన్నాడు ముత్యాలరావు పై మాటకు.

ఈయన కూడా అందంలో తన తరగతికి చెందినవాడే ననుకున్నది కాంతా రావు భార్య ముత్యాలరావును చూసి.

మిత్రు లిద్దరూ "నెస్‌కేఫ్" సేవించి, ఓ అరగంటసేపు హాయిగా కబుర్లు చెప్పుకున్నారు. కాంతారావు విసరిన ఓ జోకుకు పొట్ట చెక్కలయ్యేట్లు నవ్వుతూ ముత్యాలరావు గుండెను గట్టిగా అరిచేతులతో పట్టుకుని, "నొప్పి, నొప్పి" అంటూ కేక వేశాడు.

భయోత్పాతంతో కాంతారావుకు ముచ్చెమట్లు పోశాయి.

ముత్యాలరావు పేం కుర్చీలో కూర్చున్న పాటుగానే వాలిపోయాడు.

వెంటనే మిత్రుణ్ణి దగ్గరున్న హాస్పిటల్లోకి చేర్చాడు కాంతారావు. కాని అంతకు రెండు నిమిషాల క్రితమే ముత్యాలరావు గుండె పనిజేయడం మాని వేసింది.

మిత్రుని అకాల మరణానికి దుఃఖోద్వేగంతో కాంతారావు బెంబేలుపడి పోయాడు. కొన్ని నిమిషాలపాటు కాలూ, చేయీ ఆడలేదు. మనస్సు మేటవేసి పోయింది. ఆ దుర్వార్తను అతని భార్యకు ఎట్లా తెలియబర్చడం?

టాక్సీ చేసుకుని కాంతారావు బర్కత్‌పురా వెళ్ళాడు. ఆంధ్ర యువతీ మండలి ఎదురు గల్లీలో వున్న ఓ డాబా దగ్గరకు వెళ్ళి ఇంటి నెంబరు పోల్చుకున్నాడు. అదే ముత్యాలరావు వుండే ఇల్లు అయి ఉంటుందని నిశ్చయించుకున్నాడు. అందుకు తగినట్టుగానే ముత్యాలరావు భార్య వాకిట్లో నిలబడి ఉంది. కూతురు లోపల బొమ్మలతో ఆడుకుంటూ కనబడింది. ఫొటోలో చూసిన అతని భార్యనూ, పబ్లిక్ గార్డెన్‌లో చూసిన అతని కూతురునూ సులభంగా గుర్తించాడు కాంతారావు.

ఆమె దగ్గరకు వెళ్ళి, మబ్బులు పట్టిన ఆకాశపు మొహంతో దిగాలుపడి నిలబడ్డాడు కాంతారావు, ఆ దుర్వార్తను ఎట్లా అందజేయాలలో నోరు ముందుకు రావడంలేదు.

"ఎవరికోసం? ఏం పనిమీద వచ్చారు?" అన్నదామె సౌమ్యంగా.

"మీకో దుర్వార్త చెప్పడానికి భయపడుతున్నాను." అన్నాడు కాంతారావు దుఃఖంలో ధైర్యాన్ని చిక్కబట్టుకుని.

ఆమె అప్రతిభురాలైంది.

"ఏమిటది?"

"ముత్యాలరావుగారు గుండెపోటుతో హఠాత్తుగా మరణించారు. శవం హాస్పిటల్లోనే ఉంది." అన్నాడు కాంతారావు బొంగురుపోయిన గొంతుతో.

"అయ్యో? పాపం.... అప్పుడే నూరేళ్ళు నిండాయా? ఎంత దారుణం! అతని తలిదండ్రులకు తెలియజేయండి.... వాళ్ళు ఎక్కడ వుంటున్నారో కూడా నాకు తెలియదండీ!" అన్నదామె గాఢ సంతాపాన్ని తెలియబరుస్తూ.

కాంతారావు నిర్విణ్ణుడైనాడు.

"ఆయనకు భార్యా, ఒక అమ్మాయి...."

"ఆయన కింకా పెళ్ళి కాలేదండీ. మా ఇంటి పై పోర్షనులో ఉంటున్నాడు. గుండెజబ్బుకు మందులు తీసికోమని మా వారు ఎంత చెప్పినా వినేవాడు కాదు...." అన్నదామె సానుభూతిగా.

వచ్చే సంచికలో

ఇచ్ఛాపురపు జగన్నాథరావుగారి

నాకు నచ్చిన నా కథ